క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి సహకరించండి


ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింద ఉన్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కట్ట నుంచి ఆలయం వరకు రోడ్డును వేయాలని విన్నవించారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్‌లో రోడ్డు గురించి వాకబు చేశారు. శ్రావణమాసంలో జరిగే స్వామి వారి కల్యాణోత్సవంలోపు రోడ్డును వేయాని కమిషనర్ సత్యనారాయణను ఆదేశించారు. కల్యాణోత్సవానికి హాజరుకావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, చిలుక మధుసూధన్‌రెడ్డి, సోషల్ మిడియా ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శెట్టి శివకుమార్, సభ్యులు ఆనందప్ప, విశ్వనాథ్, పవన్, రమేష్, శివకుమార్, ప్రభు, మహేశ్, బాలరాజ్, నాగేష్, కిషోర్, అమర్నాథ్ పాల్గొన్నారు.

మంచిరెడ్డిని విమర్శిస్తే సహించం

మాజీ ఎంపీపీ కృపేశ్


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదని బీఆర్‌ఎస్ నేతలు స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీపీ కృపేష్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు చిలుకల బుగ్గరాములు, పీఏసీఎస్ చైర్మన్లు మహేందర్‌రెడ్డి, బిట్ల వెంకట్‌రెడ్డిలు మాట్లాడుతూ.. మంచాల మండలం లింగంపల్లి వద్ద డబుల్ బెడ్రూం ఇళ్లను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించి గ్రామ సభలను నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆ ఇళ్లను సందర్శించి సౌకర్యాలు కల్పించాలని కోరారే తప్పా ఎలాంటి తప్పుడు మాటలు మాట్లాడలేదన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు ఇష్టానుసారంగా మంచిరెడ్డిని విమర్శించడాన్ని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో నాయకులు నర్సింహ, భాస్కర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, జగదీష్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

12న కేశంపేటకు కవిత రాక


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కేశంపేట: మండల కేంద్రానికి ఈ నెల 12వ తేదీన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నట్లు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రమేశ్ తెలిపారు. బీసీల హక్కులు సాధనతో పాటుగా 42 శాతం రిజర్వేషన్ల అమలుకు తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు, బీసీ సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం వివిధ సంఘాల నాయకులతో కలిసి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎదిరే వెంకటయ్య, అశోక్, చీమల శ్రీనివాస్, కృష్ణయ్య, రంగయ్య, తిరుపతయ్య, గోపాల్ యాదవ్, వెంకటయ్య, శ్రీనివాస్, శేఖర్, రాఘవేందర్, లింగస్వామి, సుధాకర్, మహేశ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గేట్‌వాల్ లీకేజీ.. భారీగా నీటి వృథా

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని చైతన్య జూనియర్ కళాశాల సమీపంలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించిన గేట్‌వాల్ గత నెల రోజులుగా లీకేజీ అవుతోంది. దీంతో భారీ ఎత్తున నీరు రోడ్డుపై వృథాగా పారుతోంది. సమస్యను స్థానికులు సాక్షి ప్రతినిధి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సమస్యను మున్సిపల్ కమిషనర్ యోగేశ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన మిషన్ భగీరథ అధికారులను అప్రమత్తం చేసి, గేట్ వాల్ లీకేజీకి ఆదివారం మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన కమిషనర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

నిధులు లేక.. నిర్మాణం జరగక


అసంపూర్తి నిర్మాణంతో అంబేడ్కర్ సామాజిక సేవా భవనం


భవన సముదాయంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

- అసంపూర్తిగా నిలిచిన అంబేడ్కర్ సామాజిక భవనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ఇబ్రహీంపట్నం: నిధులలేమి అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో దాదాపు ఐదేళ్లు కావస్తున్నా అసంపూర్తి నిర్మాణంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక సేవా భవనం వెక్కిరిస్తుంది. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.30 లక్షల నిధులతో ఈ భవన నిర్మాణానికి 2021 జనవరిలో అప్పటి మంత్రి పి.సబితారెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కేటాయించిన నిధులు చాలకపోవడంతో మున్సిపల్ జనరల్ ఫండ్ కింద మరో రూ.10 లక్షలు సమకూర్చారు. దీంతో కొన్ని గదుల నిర్మాణానికి, రేకులతో కూడిన షెడ్‌కు వేసేంతవరకే వనరులు సరిపోయాయి. టయిల్స్, ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్, టాయిలెట్స్, పూర్తిస్థాయి ప్రహరీ, పెయింటింగ్ తదితర పనులకు మరో రూ.50 లక్షలు కేటాయిస్తేనే ఈ భవన నిర్మాణం పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ ఆ దిశగా అడుగులు పడడం లేదు.

పిచ్చి మొక్కలకు ఆవాసం

ఈ భవన నిర్మాణం పూర్తయితే పేదలకు ఎంతో ఉపయోగంగా మారనుంది. ఏదైన శుభకార్యాలు జరుపుకోవాలంటే ఒక్క రోజు అద్దెకు వేలాది రూపాయలు ఫంక్షన్ హాల్స్‌కు చెల్లించాల్సి వస్తోంది. అంతటి ప్రాధాన్యం ఉన్న ఈ సామాజిక భవనంపై సుమారు ఐదేండ్లుగా పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. దీంతో పిచ్చి మొక్కలు, చెత్తచెదారంతో భవన పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. దళితులు, పేదలకు ఎంతో ఉపయోగపడే ఈ భవన నిర్మాణంపై కాలయాపన చేస్తుండటం ఎంత వరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ సేవ భవనం పూర్తయితే పేదల శుభకార్యాలకు ఆర్థికభారం తగ్గే అవకాశం ఉంటుంది.

దళితులపై చిన్నచూపు



దళితుల పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. పూర్తిస్థాయి నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడంతో అర్ధాంతరంగా పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం పిచ్చిచెట్లకు నిలయంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయి నిర్మాణం నోచుకోలేదు.

– శివకుమార్, అంబేడ్కర్ సేవాసంఘం అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం

అందుబాటులోకి తేవాలి



భవన నిర్మాణానికి నిధులు కేటాయించి, అందుబాటులోకి తీసుకురావాలి. అందుకు పాలకులు బాధ్యత చేపట్టాలి. సమాజంలో పెరుగుతున్న అన్ని రకాల ధరలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే నిధులు కేటాయించి సామాజిక భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– మహేశ్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు

నిధులు రాగానే ప్రారంభం



నిధులు మంజూరు కాగానే సామాజిక భవన నిర్మాణ పనులు పునఃప్రారంభిస్తాం. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మున్సిపల్‌కు రావడంలేదు. అప్పట్లో ఈ భవన నిర్మాణానికి పూర్తిస్థాయి నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

– సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

స్నేహితుడి కుటుంబానికి తోడ్పాటు


బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న చిన్ననాటి స్నేహితులు

యాచారం: చిన్నప్పుడు తమతో పాటు కలిసి చదువుకున్న మిత్రుడి అకాల మరణం వారిని కలిచి వేసింది. తలో చేయి కలిపి చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి అండగా ఉన్నారు. మండల పరిధిలోని చింతపట్ల గ్రామానికి చెందిన దొడ్డి అశోక్ అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందాడు. చింతపట్ల ఉన్నత పాఠశాల 1998–99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన అతని స్నేహితులు ఆదివారం గ్రామంలోని బాధిత కుటుంబ సభ్యులను కలిసి రూ.లక్ష నగదుతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. భవిష్యత్తులో సైతం అండగా ఉంటామని, పిల్లల చదువులకు ఆర్థికసాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌చారి, శివ, నరేష్, పి.శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, యాదగిరి, రమేష్, సుధాకార్, అలివేలు, సరిత తదితరులు పాల్గొన్నారు.

చాతుర్మాస్య యజ్ఞం ప్రారంభం

కేశంపేట: మండల కేంద్రంలోని శ్రీశివ సీతా రామాంజనేయస్వామి దేవాలయంలో చాతుర్మాస్య యజ్ఞం కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. యజ్ఞం ప్రతీ సంవత్సరం ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ద్వాదశి (4 నెలలు) వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు, భక్తుల సాయంతో నిర్వహిస్తామని తెలిపారు. నాలుగు నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటుగా సమీప గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విశ్వనాథం, మాజీ సర్పంచ్‌లు శ్రీధర్‌రెడ్డి, తలసాని వెంకట్‌రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ మఠం చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు యాదయ్య, విజయరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనసూయ, బాల్‌రెడ్డి, రాఘవేందర్, నర్సింహ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చర్చలకు అసెంబ్లీకే రావాలి

మొయినాబాద్‌రూరల్: కేటీఆర్ ధైర్యం ఉంటే రాష్ట్ర అసెంబ్లీని వేదిక చేసుకోవాలని లేదంటే మానుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. ఆదివారం హిమాయత్ నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను కాంగ్రెస్ పార్టీ ఎండగడుతుందని గుర్తుచేశారు. ఏదీఏమైనా కాంగ్రెస్ పార్టీ 16 నెలల్లోనే రాష్ట్రంలోని ప్రజలకు ఆర్థికంగా చేయూతనిస్తూ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంతో కృషి చేస్తోందన్నారు. పదేళ్లలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో జరిగిన ఖర్గే మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను వక్రీకరించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ధైర్యం ఉంటే రాష్ట్ర అసెంబ్లీ వేదికగా తీసుకొని ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఉండి చర్చించాల్సిన బాధ్యత గుర్తుచేశారు. సంక్షేమం ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు.


ఆమనగల్లు: పట్టణంలో షర్బత్ పంపిణీ చేస్తున్న యువకులు


ఆమనగల్లు: సంకటోనిపల్లిలో పీర్ల ఊరేగింపులో గ్రామస్తులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం ఊరేగింపు

హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచే మొహర్రం ఊరేగింపు గ్రామాల్లో ఉత్సాహంగా ఆదివారం సాగింది. పది రోజులపాటు పీర్లను ప్రతిష్టించి ఊదు, బెల్లంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, చిన్నారులు, యువత కేరింతల నడుమ సవార్లను గ్రామోత్సవం తీసి, అనంతరం నిమజ్జనం చేశారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో మొహర్రం(పీర్ల పండగ) భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్


ఇబ్రహీంపట్నం రూరల్: రాయిపోల్ గ్రామంలో ఊరేగింపు


ఇబ్రహీంపట్నం: మొహర్రంలో హిందూ, ముస్లింల ఆటపాటలు


ఇబ్రహీంపట్నం రూరల్: మల్పెట్టిగూడలో ప్రత్యేక పూజలు చేస్తున్న స్థానికులు


కడ్తాల్: పీర్ల పండుగలో మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత, నాయకులు


ఇబ్రహీంపట్నం: ప్రత్యేక అలంకరణలో స్వామివారు


ఇబ్రహీంపట్నం: శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

ఆలయాల్లో తొలి ఏకాదశి శోభ

ఇబ్రహీంపట్నం: హిందువుల తొలి పండుగ ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశిని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నంలోని దేవాలయాల్లో భక్తుల తాకిడి ఎక్కువైంది. స్థానికంగా స్వయంభువుగా వెలిసిన శ్రీ లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

ఘనంగా వేడుకలు

ఆమనగల్లు: పట్టణంలో తొలి ఏకాదశి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. పలు దేవాలయాలను శోభాయమానంగా అలంకరించారు. పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, భక్త మార్కండేయ ఆలయాలను పెద్ద ఎత్తున భక్తులు సందర్శించారు. ఆలయ ధర్మకర్త కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

మైసిగండిలో..

కడ్తాల్: సకాల శుభాలు కలిగించే తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం మండల కేంద్రంతో పాటు, గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు ఉపవాసం దీక్షలు చేపట్టి, ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. మైసిగండి రామాలయం, కడ్తాల్ మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు.


ఆమనగల్లు: మూలవిరాట్


కడ్తాల్: మైసిగండి రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా శ్యాం ప్రసాద్ జయంతి


యాచారం: శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


తుర్కయంజాల్: శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నాయకులు

యాచారం: రాష్ట్రంలో ప్రజల చూపు బీజేపీ వైపు ఉందని పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతిని మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే ఎన్నిక అనే నినాదంతో శ్యాం ప్రసాద్ ముఖర్జీ ముందుకు వెళ్లారన్నారు. ఆయన అడుగుజాడల్లోనే దేశ ప్రధాని నరేంద్రమోదీ నడుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగయ్యగౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్, నాయకులు రవీందర్, కృష్ణ, ఎన్.రమేశ్, నాగరాజు, బాల్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, వెంకటేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: ఒకే దేశంలో రెండు సంవిధాన్‌లు, రెండు జెండాలు ఉండకూడదన్న గొప్ప వ్యక్తి శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. ఆయన జయంతిని ఆదివారం తుర్కయంజాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్, మాజీ సర్పంచ్ అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు రేబిస్ టీకాలు


ఆమనగల్లు: కుక్కలకు టీకాలు వేస్తున్న సిబ్బంది


ఇబ్రహీంపట్నం: కుక్కలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

ఆమనగల్లు: పట్టణంలోని పశు వైద్య కేంద్రంలో ఆదివారం వరల్డ్ జునోసిస్ డే సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు. మండల పశు వైద్యాధికారి చింతోజు అగ్నివేశ్, తలకొండపల్లి వైద్యాధికారి విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పెంపుడు, వీధి కుక్కలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా కుక్కల ద్వారా మనుషులకు సోకే రేబిస్ వ్యాధి రాకుండా నివారించడానికి ముందస్తుగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య కేంద్రం సిబ్బంది సులేమాన్, పాలాక్ష, బురాన్, అప్సర్, హరీష్, ప్రకాశ్, రమేశ్ పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ఇబ్రహీంపట్నం: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జూలై 6న జూనోసిస్ డేను జరుపుకొంటున్నట్లు స్థానిక పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డా. వసంతకుమారి, పశువైద్యాధికారి ఆనంద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం పశువైద్యశాలలో కుక్కలు, పెంపుడు పిల్లులకు ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమలో పశు వైద్యాధికారులు సుధా, దేవమ్మ, గోపాలమిత్ర జగన్, సతీష్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి


ఆమనగల్లు: విఠాయిపల్లిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ఆమనగల్లు: భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ డిమాండ్ చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామంలో ఆదివారం ఎస్సీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. చిన్నతనంలో కులవివక్ష, అంటరానితనం అనుభవించిన బాబు జగ్జీవన్‌రామ్ అకుంఠిత దీక్షతో ఉన్నత చదువులు చదివి సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్సీఆర్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నిరంజన్, మండల కన్వీనర్ యాదయ్య, నాయకులు రామలింగం, దశరథం, యాదయ్య, మల్లేశ్, జంగయ్య, యాదయ్య, నర్సింహా, కృష్ణయ్య, టోన్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.


తుర్కయంజాల్: జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు

జగ్జీవన్ రామ్‌కు నివాళి

తుర్కయంజాల్: బాబు జగ్జీవన్ రామ్ దేశ స్వాతంత్రం కోసం పోరాడుతూనే మరోవైపు సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కొరకు అలుపెరగని పోరాటం కొనసాగించారని బీఎస్పీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పట్నం రమేష్ కురుమ అన్నారు. జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం తుర్కయంజాల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్, సైదులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.